నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని టీజీఎస్పీడీసీఎల్ ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రషీద్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. గుంటల్ షా దర్గా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే హషామాబాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు. ముస్తఫానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు. బీఎన్‌కే కాలనీ, నవాబ్‌సాబ్ కుంట తదితర రెండు విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

తెలుగు సాహిత్య తిలకధారి ఆచార్య కోవెల



నివాళులర్పిస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: తెలుగు సాహిత్య తిలకధారి ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులని ప్రభుత్వ పూర్వ సాంస్కృతిక శాఖ సలహాదారులు కేవీ రమణాచారి కొనియాడారు. శుక్రవారం ఎన్టీఆర్ కళా మందిరంలో నిర్వహించిన ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యుల 12వ స్మారకోపన్యాస కార్యక్రమానికి హాజరైన కేవీ రమణాచారి మాట్లాడారు. కోవెల తెలుగు సాహితీ రంగంలో సంపత్ సాహితీ జ్యోతిగా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత వహించారు. సంపత్కుమారాచార్య పద్యవిద్యా వైభవం అనే అంశంపై ప్రముఖ రచయిత గన్నమరాజు గిరిజా మనోహర బాబు ప్రసంగించారు. డి.లక్ష్మణాచార్యులు, ఆచార్య కోట్ల హనుమంతరావు, రింగు రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సీతాయణం'



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ సంగీత కళల అభ్యున్నతికి కృషి చేస్తుందని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో శ్రీమాత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతాయణం అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. సీత జననం, కల్యాణ ఘట్టం, రావణ అపహరణ వంటి పలు అంశాలను స్పృశిస్తూ సాగిన నృత్య రూపకం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎల్వి.గంగాధర శాస్త్రి, సెన్సార్ బోర్డు సభ్యులు కళారత్న బ్నిం, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ వి.ఫణి నారాయణ, ట్రస్ట్ వ్యవస్థాపకులు టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి



సురేందర్

యాకుత్‌పురా: నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని కార్డు లేని వారు స్థానిక మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్-02 ఏసీఎస్‌ఓ మోకా సురేందర్ సూచించారు. పురానీహవేలిలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే పూర్తయిన రేషన్ కార్డుల జాబితాను ప్రభుత్వం త్వరలో నిర్వహించే వార్డు సభల కార్యక్రమంలో ఆమోదిస్తారన్నారు. నూతన రేషన్ కార్డులు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మీ సేవా కేంద్రాల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా వివాహ పత్రిక, చిరునామాకు సంబంధించిన జిరాక్స్ కాపీలతో మీ సేవాలో రూ.45 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీర జవాన్లకు నివాళి

గౌలిపురా: పుల్వామా ఘటనలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం లాల్ దర్వాజా మోడ్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు మాట్లాడుతూ..పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య నగర్ జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ కే.పవన్ కుమార్, కో కన్వీనర్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిల్పకళా వైభవం.. చెన్నకేశవ స్వామి ఆలయం

- చాళుక్యుల కాలంలో నిర్మించిన ప్రాచీన ఆలయం
- స్వామి వారికి కానుకలు సమర్పించిన ఔరంగ జేబు
- 19 నుంచి 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- ముస్తాబైన ఆలయం

చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యింది. ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కమిటీ తరఫున ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు, సున్నం వేయించి రంగు రంగుల విద్యుద్దీపాలను అమర్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్‌గౌడ్, సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్, శైలేష్ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

– చాంద్రాయణగుట్ట



ఉత్సవాలకు ముస్తాబైన చెన్నకేశవ స్వామి ఆలయం



కొలువుదీరిన స్వయంభూ చెన్నకేశవ స్వామి వారు



శిల్పకళా వైభవానికి అద్దం పట్టేలా ఉన్న ఆలయ నిర్మాణం

చెన్నకేశవ స్వామి ఆలయం వందల ఏళ్ల క్రితం చాళుక్యుల కాలంలో నిర్మించబడింది. ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు అప్పట్లో హైదరాబాద్ శివారు జిల్లాల భక్తులు కూడా ఎద్దుల బండ్లు కట్టుకొని మరీ వచ్చేవారు. ఆలయం శిథిలస్థితికి చేరుకున్న సమయంలో ఈ ఆలయ గొప్పతనాన్ని తెలుసుకున్న నిజాం నవాబు ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచినట్లు చరిత్ర చెబుతోంది. తన సలహాదారుడు బన్సీరాజ్ బహదూర్‌ను ఆదేశించడంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ ఆలయానికి 16 గ్రామాల జాగీరును కూడా రాసిచ్చారు. నిజాం నవాబు ప్రభుత్వం తరఫున గుట్ట పైకి బ్యాండ్ మేళాల నడుమ పట్టువస్త్రాలు తీసుకొచ్చేవారు. ఈ ఉత్సవాల సమయంలో ఒకరోజు సెలవు దినంగా ప్రకటించేవారంటే ఉత్సవాల ప్రాముఖ్యత ఏ పాటిదో తెలుసుకోవచ్చు.

2005 నుంచి తిరిగి ఉత్సవాలు ప్రారంభం..

అటవీ మార్గం నుంచి ఔరంగాజేబు పహాడీషరీఫ్‌కు వెళుతుండగా చాంద్రాయణగుట్ట దిగువకు రాగానే అతని అశ్వాలు ఆగిపోయాయని.. చెన్నకేశవ స్వామిని దర్శించుకోవాలని సేనాపతి సూచించడంతో ఆయన స్వామి వారిని దర్శించుకొని కానుకలు సమర్పించాక అశ్వాలు ముందుకు కదిలినట్లు కథనం ప్రాచుర్యంలో ఉంది. నిజాం నవాబు కాలం అనంతరం కొన్ని దశాబ్దాల పాటు ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహించలేదు. చివరకు 2005 నుంచి తిరిగి ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నారు. ప్రస్తుతం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అధికారికంగా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.

చెన్నరాయుని గుట్ట నుంచి.. చాంద్రాయణగుట్టగా..

విశాలమైన గుట్టపై చెన్నకేశవ స్వామి స్వయంభూగా వెలువడంతో ఈ ప్రాంతాన్ని మొదట చెన్నరాయునిగుట్టగా పిలిచేవారు. కాల క్రమేణా చాంద్రాయణగుట్టగా మారింది. కేశవస్వామి పేరు మీద ఉండడంతో కేశవగిరి అని కూడా సంభోదిస్తారు. ఈ గుట్టపైనే మహా శివాలయం, చెన్న మల్లికార్జున భ్రమరాంబ ఆలయాలు కూడా కొలువుదీరాయి. ఇక్కడి భ్రమరాంబ దేవి గుహ లోపల ఉండడం విశేషం. చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆండాళమ్మ ఆలయం, చతుర్భుజ ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. కల్యాణ మండపం వద్ద ఉన్న వృక్ష గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఉత్సవాల సమయంలో గుట్టకు కిలోమీటర్ దూరంలో ఉన్న శ్వేతగంగ నీటిని తెచ్చి పూజలకు వినియోగించేవారు. ఈ గుట్టపై ఉన్న ఆలయాల ప్రస్తావన లింగ పురాణం, కేశవ పురాణం తదితర గ్రంథాలలో ఉండడం విశేషం.

వైభవంగా నిర్వహిస్తాం..



ఫిబ్రవరి 19న బాలభోగంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 20వ తేదీనా రాత్రి స్వామివారు, అమ్మవార్ల ఎదుర్కోలు కార్యక్రమం ఉంటుంది. 21వ తేదీనా మధ్యాహ్నం 12 గంటలకు జరిగే తిరు కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకానున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వార్ల ఊరేగింపు ఉంటుంది. 22న పారాయణం, 23న మహా పూర్ణాహుతి, చక్రతీర్థం ధ్వజ అవరోహణ కార్యక్రమాలుంటాయి. ప్రాచీనమైన ఈ ఆలయాన్ని భక్తులంతా దర్శించుకొని స్వామి వారి అనుగ్రహం పొందాలి.

– మహేష్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్

ప్రశాంతంగా ముగిసిన షబే-ఏ-బరాత్

పాతబస్తీలో పర్యటించిన కొత్వాల్



చార్మినార్ కట్టడంలో పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న సీపీ సీవీ ఆనంద్

చార్మినార్: షబ్-ఏ-బరాత్ ప్రశాంతంగా ముగిసింది. ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు రాత్రంతా జాగరణ చేశారు. షబ్-ఏ-బరాత్‌ను పురస్కరించుకుని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పాతబస్తీలో పర్యటించారు. అర్ధరాత్రి చార్మినార్‌కు చేరుకున్న ఆయన సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం 1.30 గంటల వరకు గడిపారు. ముందుగా పురానీ హవేలీలోని పాత సీపీ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం కారులో చార్మినార్ చేరుకున్నారు. చార్మినార్ కట్టడం చుట్టూ కాలినడకన తిరుగుతూ స్థానిక వ్యాపారులను పలకరించారు. దక్షిణ మండలంతో పాటు దక్షిణ పశ్చిమ మండలాల పరిధిలోని పాతబస్తీలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అవసరమైన అన్ని కీలక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లింలతో పాటు నగర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది షబ్-ఏ-బరాత్ సందర్భంగా రాత్రంతా విధి నిర్వహణతో జాగరణ చేశారు. సీపీ వెంట నగర అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వ ప్రసాద్, దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, దక్షిణ మండలం ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ సాయి మనోహర్, డీసీపీ క్రైమ్స్ స్నేహారెడ్డి, టాస్క్‌ఫోర్సు అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, దక్షిణ మండలం అదనపు డీసీపీ మాజిద్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్, చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులున్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో మధిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఇమాంపురాలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇమాంపురా నవ భారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మైలప్రోలు, బొడ్రాయి నాబి శిల ప్రాంగణం, రేణుకా ఆలయాల్లో అభిషేకం, అలంకరణ, హోమం, అఖండ హారతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం బోనాలు, పుట్టమన్ను, గంగ తెప్ప, ఆదివారం పూజారి రాంచందర్ ఒగ్గు కళాకారుల బృందంతో రేణుకా కల్యాణం తదితరవి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జస్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, ఆర్.బాలకిషన్, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, సి.బాబు, కె.శ్రీకాంత్, ఎం.దర్శన్, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ హాస్టల్‌ను సందర్శించిన విద్యాశాఖ చైర్మన్



విజయనగర్‌కాలనీ: హాస్టల్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ ప్రతినిధి దాసరి రవిప్రసాద్ హాస్టల్‌లో నెలకొని ఉన్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి



మంచినీరు అందజేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: రాబోయే వేసవి కాలంలో దాహం తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ కోరారు. స్థానిక ప్రాంతాల వ్యాపారులతో పాటు సిబ్బంది, వినియోగారుల సౌకర్యార్థం రికాబ్‌గంజ్‌లో శుక్రవారం పంకజ్‌కుమార్ అగర్వాల్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుడే ఎండలు మండిపోతున్నాయని..మండే ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు తాగునీటి కోసం పరితపిస్తారన్నారు. కార్యక్రమంలో సురేందర్, రాజ్‌కుమార్ నార్నోలీ, శ్రీనివాస్, అనూప్ అగర్వాల్ తదితరులున్నారు.

యూ డైస్ ప్లస్‌పై అవగాహన

గోల్కొండ: యూ డైస్ ప్లస్ పాఠశాలకు గుండెకాయ లాంటిదని గోల్కొండ తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం గోల్కొండ రిసాల బజార్‌లోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గోల్కొండ మండలాలకు చెందిన పాఠశాలల వారికి యూ డైస్ ప్లస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూ డైస్ ప్లస్ అంటే పాఠశాల జీవిత చరిత్ర అని అన్నారు. ఇందులో అడిగిన విషయాలన్నిటిని తూచా తప్పకుండా పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ మండల డిప్యూటీ ఐవో ఎస్ మహ్మద్ బషీర్, అఖిల్, తిరుపతి, విజయ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

16న లక్ష్మీనారాయణ గాయత్రి మహా యజ్ఞం

జియాగూడ: ఈ నెల 16న పురానాపూల్‌లోని శ్రీ పంచాయతీ అకాడ బడా ఉదాసిన్‌లో లక్ష్మీ నారాయణ గాయత్రి మహా యజ్ఞం 5 కుండల గాయత్రీ మహా యజ్ఞం, గాయత్రీ పరివార్, తత్వదాన్ శాంతి కుంజ్ హరిద్వార్ వారి ఆధ్వర్యంలో జరుగుతాయని మాకె దూద్ కా కర్జ్ గోశాల, అకాడ మహంత్ యోగి ప్రశాంత్ దాసజీ మహారాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వ శాంతి కోసం నిర్వహిస్తున్న ఈ యజ్ఞంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం విశాల్ బండారా కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రేమికులను అడ్డుకునే సంస్థలను నిషేధించాలి

సుల్తాన్‌బజార్: ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకించిన మతోన్మాద బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్‌లాంటి సంస్థలను నిషేధించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జేరుసెలం మత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలో ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఫిబ్రవరి 14 వాలంటైన్స్ డే యువతీయువకుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అన్నారు. రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకంగా వాలంటైన్స్ డేను హిందూ సంఘాలు వ్యతిరేకించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

శాతం చెరువు వద్ద సెక్యూరిటీని నియమించిన బల్దియా



గోల్కొండ: నయాకీలాలోని శాతం చెరువులో వ్యర్థాల డంపింగ్‌ను నివారించడానికి ఎట్టకేలకు సంబంధిత అధికారులు నడుంబిగించారు. చెరువులో కొంత కాలంగా కొందరు యథేచ్ఛగా ఆటో ట్రాలీలు, డీసీఎంలలో వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో కూడా ఎన్నో కథనాలు వచ్చాయి. ఎట్టకేలకు బల్దియా వారు స్పందించి శాతంచెరువు కట్టపై ముగ్గురు సభ్యులతో కూడిన డీఆర్‌ఎఫ్ సిబ్బందిని నియమించారు.

పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు అందించాలి



మహ్మద్ ఆజామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు అందించాలని ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అన్నారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది మహ్మద్ ఆజామ్‌ను శుక్రవారం గోల్కొండ బంజారా దర్వాజా వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా మహ్మద్ ఆజామ్ ఎన్నో పేద కుటుంబాల వారికి అండగా ఉండి కోర్టులలో వారికి న్యాయం జరిపించేలా ఉచితంగా న్యాయ సలహాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్జా జమీల్, అబ్బాస్ హుస్సేన్, తదితరులున్నారు.

ఆలయ ముఖద్వార పునర్నిర్మాణ పనులు ప్రారంభం



చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ లలితాంబ ఆలయ ముఖద్వారం పునర్మిరాణ పనులకు ఆలయ కమిటీ చైర్మన్ పి.రాహుల్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. శుక్రవారం పనులను కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి గతంలో నిర్మించిన ముఖద్వారం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతనంగా నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దుర్గేష్ గౌడ్, నాయకులు రాజు యాదవ్, ఎ.మహేష్ గౌడ్, దామోదర్ రెడ్డి, వెంకటేష్, అనిల్, కిరణ్, పవన్, పొన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



శాలిబండ: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలో 8 ఎంఏఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. గతేడాది వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదైన నేపథ్యంలో ఈసారి అలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింహులు, మెట్రోజోన్ సీఈ చక్రపాణి, ఎస్ఈలు సోమిరెడ్డి, దిలీప్ కుమార్, డీఈలు శ్రీధర్, నరేందర్‌రెడ్డి, హేమచందర్, వెంకటేష్ గౌడ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ గౌడ్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తా



బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూజల్లో పాల్గొన్న ఉమామహేంద్ర

చార్మినార్: జిల్లాలో బీజేపీని మరింత పటిష్టం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని గోల్కొండ గోషామహల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన టి.ఉమా మహేంద్ర అన్నారు. ఆయన నియామకాన్ని తెలుసుకున్న పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు చార్మినార్ పేట్లబురుజులోని ఆయన ఇంటికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. పురానాపూల్ దర్వాజా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం దర్బార్ మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని పార్టీ అభివృద్ధికి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సురేందర్, నరేందర్, కునాల్‌రావు, రంజిత్‌సింగ్, విజయ్‌సింగ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ముంద్రాయి శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్‌యాదవ్

నాంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను పురస్కరించుకుని గోషామహల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు ముంద్రాయి శ్రీనివాస్, సత్యం గౌడ్, జగపతి శేఖర్, జె.మల్లేష్‌లు నివాళులు అర్పించారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి ఏఆర్ పెట్రోల్ బంకు సమీపంలోని దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలను వేసి ప్రసంగించారు. దామోదరం సంజీవయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నేటి యువతరం ఆయన బాటలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

గాంధీభవన్‌లో..

అబిడ్స్: దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, శ్యామ్ సింగ్, బద్రినాథ్, మనోజ్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పటిష్టతకు, సమాజ అభ్యున్నతికి సంజీవయ్య చేసిన సేవలు కొనియాడారు.

జడ్జిపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు

యాకుత్‌పురా: రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై జరిగిన దాడిని తెలంగాణ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీ సుబ్బయ్య తీవ్రంగా ఖండించారు. సిటీ సివిల్ కోర్టులోని రాష్ట్ర న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 13న రంగారెడ్డి జిల్లా కోర్టులో కేసు విచారణ జరుపుతున్న జడ్జిపై నిందితుడు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు సాయి కుమార్, నరసింహారెడ్డి, ఆశాలత, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273